'ఆటా' పోటీల్లో ఎంపికైన కథ

# మోక్షం

ఎలక్ట్రాన్

పరాంకుశానికి వయసు తొంభై దాటింది. అయినా నడుము వంగలేదు. కంటి-చూపు మందగించలేదు. ఊడిన దంతాలు ఊడినా, ఉన్నవి మట్టుకు పటిష్ఠంగా ఉండి నోరు బోసికాలేదు. మతిమరపు రాలేదు, మాట స్పష్టత చెదర లేదు. పదేళ్ళయి యిల్లాలు పోయినా- యిల్లు వదిలి, పల్లె వదిలి పట్నాల్లో ఉన్న కొడుకుల పంచ చేర లేదు. మధ్యమధ్యలో వర్షాభావం చేత మొరాయించినా పది గింజల్నిచ్చే పొలాన్ని వదులుకోలేదు. తనకు చేదోడువాదోడుగా ఉండే పనిమనుషుల్నీ, ఆధ్యాత్మిక చింతనల కాలవాలమైన ఊరి శివాలయాన్నీ వదల లేక, కొడుకులు రమ్మన్నా పోక, దిగవేసిన రాటలా ఆ పల్లెపట్టులోనే ఉండిపోయాడు.

పరాంకుశం యిరవైరెండో ఏట వివాహమాడి నలభై అయిదో పడిలో పడేసరికి తొమ్మండుగురు సంతానానికి తండ్రి అయ్యాడు. అయిదుగురు మగ సంతానం, నలుగురు ఆడ సంతానం. అందరూ వారికి నచ్చిన, వచ్చిన చదువులు చదివి, ఉద్యోగాలు సంపాదించి రాష్ట్రంలోనూ, దేశంలోనూ, విదేశాల్లోనూ వాళ్ళవాళ్ళ జీవితాల్లో స్థిరపడ్డారు.

కొడుకులూ, కూతుళ్ళూ, యిరువైపుల మనవలూ, మనవరాళ్ళూ మూల విరాట్టు పరాంకుశానికి ఆహ్వానాలు పంపుతూ వచ్చారు. చివరికి వాళ్ళ నిష్ఠూరాలు భరించలేక యింటినీ, పొలాన్నీ జాగ్రత్తగా చూడమని పనివాళ్ళకీ, ఊర్లోని బంధువులకీ చెప్పి కదిలాడు. ఏడాదిపాటు దేశాటనలోనూ, విదేశీయానంలోనూ గడిపి, వంశాంకురాలతో కాలక్షేపం చేసి, బండెడు అనుభవాల జ్ఞాపకాలతో తిరిగి పల్లెలో అడుగుపెట్టాడు.


ప్రయాణానికి ముందు పరాంకుశం మనస్సు ప్రశాంతంగా ఉండేది. తిరిగి వచ్చిన తర్వాత మనసులో ఏదో అసంతృప్తి, తత్కారణంగా అశాంతీ చోటు చేసుకోసాగాయి. తరాల అంతరాలూ, జీవన విధానాలూ బేరీజు వేసుకొంటూ తను జీవితంలో ఏదో కోల్పోయినట్టు బాధపడసాగాడు.

పసితనంలో తన్ను తల్లి ఎలా పెంచిందో తెలియదు కాని ఊహించుకోగలిగాడు. మట్టి నేలమీద పాకడానికి వదిలేసి, వంటింట్లో తన పని తాను చూసుకొనేదేమో? ఏడిస్తే చీర ఉయ్యాలలో పడుకోబెట్టి పక్కింటి పెద్దావిడతో కబుర్లలోకి దిగేదేమో?

ఢిల్లీలో మనవడి కొడుక్కి తల్లి స్తన్యం లేదు. ఖనిజ లవణాలు కలిసిన పాల పొడితో చేసిన పోత పాలు. కేరట్ దుంపల రసం. ఆరారా యాపిల్ రసం. మెత్తటి పరుపులున్న తోపుడు బండి. జిప్ దోమ తెరలతో ధారాళంగా గాలి ఆడే, చూడముచ్చట గొలిపే ఉయ్యాల.

పలక మీద కణికి పుల్లతో అక్షరాభ్యాసం. రాసిన దాన్ని చెరపడానికి చొక్కా అంచు, లేదా నాలికతో తడి చేసుకొన్న చెయ్యి. జారిపోయే లాగుతో, చీమిడికారే ముక్కుతో తెలుసున్న మేస్టారి వెనక పాఠశాలకి రాకపోకలు. కాలికి చెప్పుల్లేక, పుస్తకాల మోతకి సంచీల్లేక, ఎండావానలనుంచి రక్షణ లేక, మాడి నడవడమో, తడిసి రావడమో జరిగేది. పాఠశాలలో దాహమేస్తే కుండలో నీళ్లు. అందరి ఎంగిలీ భరించే యిత్తడి గ్లాసు. అందరూ భరించవలసిన ఎంగిలి యిత్తడి గ్లాసు.

మూడున్నర సంవత్సరాల వయసులో ఉన్న బెంగుళూరు మునిమనవరాలు ఒకటో తరగతికి రెండు మెట్లు దిగువగా ఏదో 'నర్సరీ' క్లాసట చదువుతూ, స్కూలు యూనిఫారం ధరించి, లంచ్ బాక్స్‌తో, గొట్టంతో పీల్చుకొనే సదుపాయం గల నీటి సీసాతో, రంగురంగుల పెన్సిళ్ళతో, డ్రాయింగ్ పుస్తకాలతో, వీటన్నిటినీ మోసే వీపు సంచీతో, స్కూలు బస్సులో ప్రయాణం చేసి అయిదు కిలోమీటర్లు దూరంలో



ఉన్న పాఠశాలకి వెళ్ళి వస్తుంది. తను స్కూలు నుంచి యింటికొచ్చిన తర్వాత ఏం చెప్పారని కాని, ఏం నేర్చావని కాని, ఎన్ని మార్కులొచ్చాయని కాని అడిగేవారు కాదు.

బెంగుళూరు మునిమనవరాలు స్కూలునుంచి తిరిగి రాగానే, ఆ బొడ్డూడని పిల్లకి తల్లో, తండ్రో పక్కన కూర్చుని, ఆ పిల్లకిచ్చిన హోంవర్క్ తామే సొంతం చేయించడం లేదా చేయడం.

తన చదువుని గురించి తన తండ్రి పట్టించుకోకపోయినా, తను తనపిల్లల దగ్గరకూర్చుని చదివించకపోయినా, కొంతలోకొంత నయంగా వీలయినంతగా పంతుళ్ళ దగ్గరికి వెళ్ళి పిల్లల చదువుల గురించి ఆరాలు తీసేవాడు.

తను అయిదో క్లాసులోకి వచ్చేసరికి తండ్రి వారానికి జేబు ఖర్చుకని రెండణాలిచ్చేవాడు. అణాలో నాలుగో భాగం, రూపాయిలో అరవైనాలుగో భాగం అయిన 'కానీ'కి ఆరు నువ్వుపప్పు అద్దిన బెల్లంజీళ్ళు దొరికేవి. రోజుకో కానీ ఖర్చు. ఆదివారమొచ్చేసరికి రెండు కాసులు- అంటే అర్ధణా ఆదా. ఎనిమిది వారాలు గడిస్తే నాలుగణాలు అంటే పావలా ఆదా. తీర్థాల్లో రంగులరాట్నం తిరగడానికి, పట్నంలో ఎండిన చెరువు మధ్య డేరావేసి ఆడే సర్కస్‌ని చూడ్డానికి ఆ డబ్బులు చాలేవి.

యిప్పుడు ఢిల్లీ మనవడి కొడుక్కి స్కూలుకి వెళ్ళబోయే ముందు పది రూపాయలు చేసే కాడ్‌బరీస్ చాక్లెట్. తండ్రి ఆఫీసునుంచి తిరిగి వచ్చేటప్పుడు, తల్లి ఏ పనిమీదో గుమ్మం వదిలి బయటికి వెళ్ళినప్పుడల్లా టాఫీలో, చాక్లెట్లో, కేకులో తీసుకురావడం తప్పనిసరి. మారాం చేసినప్పుడల్లా బయటకు తీసుకువెళ్ళి అయిస్క్రీం పెట్టించడం పరిపాటే. పిల్లల పళ్ళు పాడవుతాయన్న జ్ఞానం లేదు వాళ్ళకి. వాళ్ళతో గడిపిన సమయంలో తనూ వాటి రుచి మరిగాడు. అటువంటివి ఈ పల్లెలోనే కాదు, పక్కనున్న పట్నంలోకూడా దొరకవు. యిప్పుడు వాటిమీద మనసుపోతోంది.

తనని పదోక్లాసుతో చదువుమానిపించి తండ్రి వ్యవసాయంలోకి తీసుకుపోయాడు. పొలానికి పోయేముందు, దారిలో శేషయ్య పాక హోటలు దగ్గర ఆగి, అల్లం, పచ్చి మిరపకాయలు దట్టించి వేసిన రెండు పెసరట్లు తినేవాడు. యింట్లో ఉదయపు ఫలహారం తయారుచెయ్యడమనే ప్రసక్తేలేదు. సాయంత్రం ఆకలివేస్తే 'అమ్మన్న' అరుగు మీద వేసే ఉల్లిపాయ బజ్జీలు లేదా పకోడీలు. పండగలొస్తేనే యింట్లో పిండి వంటలు. బంధువులొస్తేనే ఉప్మా ఫలహారాలు. దారిలో దాహమేస్తే వీరన్న కిళ్ళీబడ్డీలో నీళ్ళ తొట్టిలో ఉంచిన గోళీ సోడాలు.

ఈ ప్రయాణంలో అందరింటా ఉదయమే ఫలహారం. చిరు తిళ్ళకి సాండ్ విచెస్. యింటికొచ్చే పిజ్జాలు. బర్గర్స్. రకరకాల బిస్కట్లు, కేకులు. యితర తిరుబండారాలు. రకరకాల మిఠాయిలు. ఫ్రిజ్‌లో శీతల పానీయాలు.

తాటి కల్లుకి స్కాచ్ విస్కీకి ఎంతటి తేడా? వేడి వేడి గారెలతో చల్లటి బీరు సేవిస్తే ఎంతటి మజా?

యింటికి అతిథులొస్తే వీధి అరుగుమీద నాలుగు చాపలు. ముందు సావిట్లో నాలుగు నవారు మంచాలు. కూర్చోడానికీ, నడుం వాల్చడానికీ అవే. విసురుకోవడానికి తాటాకు విసనకర్రలూ, కండువాల అంచులూ. ఉక్కిపోయే శరీరాలమీద దోమలు పొడిచే ఎర్రబొట్లు.

యిప్పుడు తన వాళ్ళందరూ దర్జాగా బ్రతుకుతున్నారు. అందంగా తీర్చిదిద్దిన ఫ్లాట్లు, స్పాంజ్ రబ్బరు దిళ్ళతో, పరుపులతో సోఫాలూ, మంచాలూ. సీలింగ్ ఫాన్లు, రూమ్ కూలర్లు, ఆర్థిక స్థోమత ఉన్నచోట్ల ఎయిర్ కండిషనర్లు.

అప్పట్లోనూ, యిప్పట్లోనూ తనింట్లో పీటా, అరిటాకూ వేసే అందరికీ భోజనం. చేతులతో తోసి వడ్డించేవాళ్ళ పాద దర్శనం తప్పనిసరి. వద్దంటే చేతులు అడ్డం పెట్టడం. కావాలని మనసులో ఉన్నా ఆడవాళ్ళకి మిగుల్తుందో లేదో అన్న సంశయంకొద్దీ చాలామార్లు మౌనంగా ఉండిపోవడం. చీమలూ, పురుగులూ ఆకుల్లోకి పాకడం, ఆకు చిరిగి చారూ, మజ్జిగలతో నేల రొచ్చు కావడం సామాన్యం.

కుర్చీలు, డైనింగ్ టేబిళ్ళు, తళతళ మెరిసే ప్లేట్లు. చెంచాలు, కత్తులు, ఫోర్కులు, వండింది అందంగా అమర్చడం, కుర్చీల్లో కూర్చుని తినడం, ఎవరికి కావల్సింది. నచ్చింది వారే వడ్డించుకోవడం, కుటుంబ వ్యవహారాలనుండి రాజకీయాలవరకూ చర్చించుకోవడం- అదో రకమైన అనుభవం. షడ్రుచులకి నూతన నిర్వచనాలు చెప్పే కొత్త రుచులు. పాక ప్రయోగాలు. హాయిగా, తీరుబడిగా కబుర్లు చెప్పుకొంటూ చేసే రాత్రి భోజనాలు బహుముచ్చట గొలిపేవి.

తను తెరవెనుక నుంచి ఆడించిన తోలుబొమ్మలాటలు చూశాడు. నడి వీధిలో వేదికని నిర్మించి ఆడిన నాటకాలు

చూశాడు. స్త్రీ పాత్రలు ధరించిన పురుష నటుల్ని చూశాడు. తెరమీద కదిలే చలనచిత్రాలు చూశాడు. నట్టింట నిలబడిన టీ.వీలో చలనచిత్రాలు చూశాడు. ప్రకటనల్లో, ప్రస్తుతం వస్తున్న సినిమాల్లో అర్థనగ్న నాయికల్ని చూశాడు. ఈ ప్రయాణంలో తను మజిలీ చేసిన చోట్లలో, యిళ్ళలో ఎవరూ లేనప్పుడు దేశంలోనూ, విదేశాల్లోనూ నీలిచిత్రాలు చూశాడు. బేల్‌పూరి తిని పారేసిన కాయితాల్తో, తాగి పారేసిన కొబ్బరి బొండాలతో, యితరాలైన చెత్తాచెదారాలతో నిండిన మన దేశపు సముద్ర తీరాల్ని చూశాడు. ఎదల ఊపులతో, ఊరువుల సోయగాలతో, నడకల వయ్యారాలతో కనువిందులుచేసే శ్వేత సుందరీమణులు విహరించే విదేశ సముద్ర తీరాలూ చూశాడు. లండన్ సోహోల్లో, పారిస్ పిగాల్‌లో ఏ దేశపు సుందరి కావాలన్నా లభ్యమౌతుందని తార్పుగాళ్ళు వెంటబడినప్పుడు బేజారెత్తిపోయాడు. పలువురు యువతులు కన్నుగీటి, రమ్మని సైగచేసినప్పుడు వడివడిగా అడుగులు వేశాడు. దిస మొలలతో నారీమణులు నృత్యాలు చేసే ప్రదర్శనశాలలకు వెళ్ళాడు. వారి సోయగాల్ని తిలకించిన తనకు మతిపోయినంత పనైంది.

యిదిగో, ఈ అంశమే నిరంతరమూ వెంబడిస్తూ పరాంకుశాన్ని విపరీతంగా సతాయించసాగింది.

తన యిరవై రెండవ ఏట నలుగురు మేనమామలూ యిబ్బడిముబ్బడిగా ఒత్తిడి తీసుకొచ్చేశారు. అందరికంటే పెద్ద మేనమామ తన అధికారాన్ని చెలాయించి, ఆఖరి కూతురు నాగదేవమ్మను పదేకరాల మాగాణితో సహా పరాంకుశానికి కట్టబెట్టాడు.

బక్కగా, పల్చగా ఉన్న నాగదేవమ్మ ద్వారా పరాంకుశానికి ఎముకల స్పర్శే తప్ప కండస్పర్శ లభించలేదు. అయినా వివాహ వ్యవస్థమీది గౌరవంతో సజావుగానే కాపురం చేశాడు. నాలుగ్గోడల మధ్యా ఉక్కబోత వ్యవహారం. గదిలో వెల్తురుంటే బయటవాళ్ళు చెక్క తలుపుల నరదల్లోంచి చూస్తారన్న భయం. కితకితలు పెడ్తే పకపకలు బయటవాళ్ళకు వినిపిస్తాయన్న భయం. ఎప్పుడు, ఎవరు పిలుస్తారే మోనన్న శంకకొద్దీ నాగదేవమ్మకు చీర విప్పడానికి భయం. ఆ కాస్త స్పర్శతోనే నిర్జీవమైన అనుభూతుల్ని పొంది, ప్రసాదించి ముప్పాతిక డజను సంతానాన్ని కన్నాడు పరాంకుశం. వారి పట్ల బాధ్యతల్ని నిర్వహించి, తృప్తి పొందాడు.

అయితే ఈ పర్యటనతో జీవితంలో, ముఖ్యంగా వైవాహిక జీవితంలో ఏం కోల్పోయిందీ గ్రహించసాగాడు.

వాత్స్యాయనుడు పుట్టిన దేశంలో, దేవాలయ గోపురాల మీది శిల్పాలు వైవాహిక జీవితమంటే ఏమిటో తెలిపే దేశంలో తను శృంగార రహితమైన జీవితాన్ని గడపడం విచిత్రమనిపించింది పరాంకుశానికి. నాలుగ్గోడలూ చీకటినీ, మరుగునీ యిచ్చాయేమోకాని, గృహిణితో విశృంఖల శృంగార జీవితం గడపడానికి కావల్సిన ఏకాంతాన్నివ్వలేదు. వలచి వనితను చేబట్టే స్వేచ్ఛను ఆనాటి సమాజం తనకివ్వలేదు.

ఆ చెయిజారిన జీవితం తిరిగి దక్కించుకోవాలంటే తను మళ్ళీ బాల్యంలోకి అడుగుపెట్టాలి! బాల్యంలోంచి యవ్వనంలోకి అడుగుపెట్టాలి.

శివాలయం తూర్పు ప్రాకారం మధ్యగా గోపురం. గోపుర ప్రవేశ ద్వారం ద్వారా బయటకు వెళ్తే కోనేటికి దిగే మెట్లు. మెట్లకిరువైపులా ఎత్తు అరుగుల మండపాలు. ఒకవైపు రాతి మండపంలో కూర్చున్న పరాంకుశం 'పరమేశ్వరా అనుగ్రహించు' అనుకొన్నాడు.

"అది అసాధ్యం. నేలమీద ఒలికిన నీళ్ళతో మళ్ళీ పాత్రని నింపడం శుష్కప్రయత్నం మాత్రమే!" కాస్త దూరంలో కూర్చుని చిలుము పీలుస్తున్న సాధువు అన్నాడు.

పరాంకుశం అతనివైపు చూశాడు. "ఏమిటీ? మీరు నన్ను ఉద్దేశించి అన్నమాటలేనా?" అనుమానంగా ప్రశ్నించాడు.

"ఆహా, నిన్ను ఉద్దేశించే! నీ ఆలోచనలు గ్రహించి అన్న మాటలే!" సాధువు చిద్విలాసంగా నవ్వుతూ అన్నాడు.

పరాంకుశం ఆ సాధువువైపు ఆశ్చర్యంగా, పరీక్షగా చూశాడు. చూస్తూ అన్నాడు. "ఎందుకు సాధ్యంకాదు? గుడ్డతో వత్తి పాత్ర నింపవచ్చు."

"ఆ ప్రక్రియ జరిపేలోగా కొంత నీరు ఆవిరైపోతుంది. గుడ్డ తడుస్తుంది. తుడిచినంతమేర నేల తడిగా కొంతసేపటి వరకూ ఉంటుంది. గుడ్డ పిండిన నీరు కొంత మాత్రమే మురికిగా పాత్రలోకి దిగుతుంది. ఆ నీరుని నువ్వు తాగలేవు."

"నేలమీద ఒలికినవి పాలూ, నీళ్ళూ అనే ఎందుకనుకోవాలి? పాద రసం అవొచ్చుగా. ఒలికిన పాదరసాన్ని ఒకచోట చేర్చవచ్చు. పాత్రలోకి నింపవచ్చు. అంటిన మట్టిని తొలగించవచ్చు." పరాంకుశం వాదించే ధోరణితో అన్నాడు.

"నువ్వన్నమాట నిజమే, కాదనను. కాని పాదరసం నీ దాహం తీరుస్తుందా? అది దాహంతీర్చే ద్రవం కాదు, ప్రాణం తీసే విషం. చంచలమైన మనస్సుకు సామ్యం పాదరసం. దాన్ని అదుపులో ఉంచుకొంటే జీవితం నిర్మలమైన నీటి ప్రవాహంలా సాగిపోతుంది. నువ్వింత కాలమూ చేసిందదే. నువ్వు కోల్పోయిందేమీలేదు. ఏదో కోల్పోయామన్న భ్రమతో కాలచక్రాన్ని వెనక్కి తిప్పడమనేది వెర్రితనం!" సాధువు అన్నాడు. అన్నాక ఓసారి గట్టిగా చిలుము దమ్ము పీల్చాడు.



**మిరుమిట్లుగొలిపే వెల్తురు కనబడగానే పరాంకుశం ఒక్క క్షణం కళ్ళు మూసుకొన్నాడు. కళ్ళు తెరిచేసరికి ఎదురుగా, పురుడుపోసిన అందమైన నర్సు కురచ దుస్తుల్లో కనబడింది. పరాంకుశం పెదవులపై చిరునవ్వు చిందిస్తూ కన్ను గీటాడు.**

"యయాతి అనే రాజు తన వార్ధక్యాన్ని తనద్వారా శర్మిష్ఠకు పుట్టిన కొడుకు పూరుడికి అంటగట్టి, వేల సంవత్సరాలు యవ్వన సుఖాలు అనుభవించి శుక్రాచార్యులవారి శాపంనుండి తప్పించుకొన్నాడు. అతడు వెర్రివాడా?" పరాంకుశం సాధువుని ప్రశ్నించాడు.

"కాకపోవచ్చు. కాని యయాతి స్వార్థపరుడు. పూరుడి పితృభక్తిని ఓ భావోద్రిక్త బెదిరింపుగా, ఓ బలహీనతగా వాడుకొని తను ఆశించింది నెరవేర్చుకొన్నాడు. అయితే యయాతి కూడా ఆ నిత్య యవ్వన జీవితమంటే విరక్తిపుట్టి తన వార్ధక్యాన్ని వెనక్కి తిరిగి తీసుకొన్నా, ఆమేరకు పూరుడికి అన్యాయం చేశాడు."

"ఆ కాలంలో అటువంటి శక్తులున్నాయి కాబట్టి, అంత లేసి జీవన కాలాలున్నాయి కాబట్టి సాధ్యమైంది. ఈ కాలంలో అటువంటిది సాధ్యం కాదు. సాధ్యమైనా, నా కొడుకులే ముసలివాళ్ళైపోయారు. వాళ్ళనేం అడుగుతాను? నా మనుమల జీవితాన్ని అడిగే హక్కు నాకు లేదు. ఏదో మీరన్న మాటలకి యయాతి ప్రసక్తి తీసుకువచ్చానే కాని, వాస్తవానికి ఆ విధంగా యవ్వనం సంపాదించాలని నేననుకోలేదు!" అన్నాడు పరాంకుశం నిజాయితీగా.

"అయితే నీ శేష జీవితాన్ని నిశ్చింతగా గడపడానికి నీ కొడుకులూ, మనవలూ సర్వసౌకర్యాలనీ కలిగించడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, కాలంలో వెనక్కి వెళ్ళాలనే ఈ ఆలోచన ఎందుకు?" సాధువు ప్రశ్నించాడు.

"ఏదో ఈ పల్లెపట్టున ఉండి, ఈ దేవాలయంలోని శివుణ్ణి ఆరాధ్య దైవంగా పూజిస్తూ కూర్చున్నవాణ్ణి పనికట్టుకొని లాక్కువెళ్ళారు! యిప్పుడు నేను ప్రపంచంలో చూసింది చాలా తక్కువనీ, యింకా చూడవలసింది చాలా ఎక్కువ ఉందనీ అనిపించి తపన బయలుదేరింది. అందుకనే వెనక్కి వెళ్ళాలనిపిస్తోంది.

"వెన్నెలలో హిమాలయ పర్వతాలనధిరోహించి కింద నున్న సుందర దృశ్యాల్ని చూడాలని, మధ్యప్రాచ్యపు ఎడారిలో సంచరించి పిరమిడ్లలో విశ్రమిస్తున్న మమ్మీ పేటికలని దర్శించాలని, ప్రపంచంలోని అద్భుతమైన కట్టడాల్నీ, అతి సుందరమైన ప్రదేశాల్నీ చూడాలనీ, పశ్చిమ స్వర్గ దేశాలను మరోమారూ, మరోమారూ సందర్శించి ఆ జీవన శైలిలోని అనుభూతుల్ని పొందాలనీ, అన్నిటికంటే ఆఖరుగా కానీ చాలా ముఖ్యంగా- యవ్వనంతో మదించిన ప్రపంచ సుందరీమణులతో శృంగార రాజ్యాలేలాలనీ మనసు ఉరుకులూ, పరుగులూ వేస్తోంది!

"ప్రపంచం యింత అందంగా ఉంటుందని తెలిసేసరికి, జీవితాన్ని ఎంత రసవత్తరంగా గడపవచ్చో గ్రహించేసరికి వయసు ముంచుకొచ్చేసింది. అందుకే... అందుకే నేను మళ్ళీ బాల్యంలోకి వెళ్ళిపోవాలి.

"యిన్ని రోజులూ గృహస్థుగా నా ధర్మం నిర్వహిస్తూనే ఆధ్యాత్మిక చింతనతో ప్రవర్తించాను. ఒకరికి మేలుచేశానే గాని, హాని ఎప్పుడూ, ఎప్పుడూ తలపెట్టలేదు. నిత్యం శివుణ్ణి పూజించాను. అందుకే ఆ శివుణ్ణే మార్గం చూపించమని కోరుకొన్నాను."

"ఈ మాత్రం కోరిక తీర్చుకోడానికి ఆ శివుణ్ణెందుకు బాధపెడ్తావు? నేను చాలనా ఏమిటి? కాస్సేపు ప్రశాంతంగా నిద్రపో. కోరిక తీరుతుంది!" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

శివాలయం పూజారి విగత జీవుడై పడి ఉన్న పరాంకుశాన్ని చూశాడు. అందవలసిన వాళ్ళకి కబుర్లంది రావలసిన వాళ్ళూ, రాగలిగిన వాళ్ళూ వచ్చారు. 'కర్మజీవి', 'ధర్మజీవి' అని పల్లె ప్రజలు కన్నీరు కార్చారు.

పరాంకుశం 'ఆత్మ'అనే ఆరోప్రాణం యోగ నిద్రలోకి పోయింది. ఒక చితాభస్మపు రేణువుని శయ్యగా చేసుకొని నదిలో కలిసింది. ప్రవహించే నదితో పోయి సాగరంలో చేరింది. ఆవిరైన ఒక నీటి బిందువు ఆధారంగా నింగి కెగసి మేఘంలో చేరింది. భూమివైపు పయనించిన ఆ మేఘం కురిపించిన వర్షంలో ఒక నీటి బిందువుతో నేలకు జారి భూమిలో యింకింది. వరి యొక్క వేళ్ళ ద్వారా వడ్ల గింజలో ప్రవేశించింది. ఆ వడ్లగింజ మీద ఎవరి పేరు వ్రాసుందో వారి నోట పడి, శుక్రకోశాల్లోకి చేరింది. ఆ పురుషుడు స్త్రీతో ప్రకృతి ధర్మం నిర్వహించినప్పుడు. ఆమె గర్భకోశంలో విడిది చేసి ఉన్న అండాన్ని చేరుకొంది. కారు చీకటిలో పరాంకుశం 'ఆత్మ'యోగ నిద్రనుండి మేల్కొని, గర్భవాసపు చెరనుండి విముక్తికోసం ఎదురు చూడసాగింది.

ఆ క్షణం రానే వచ్చింది. మిరుమిట్లుగొలిపే వెల్తురు కనబడగానే పరాంకుశం ఒక్క క్షణం కళ్ళు మూసుకొన్నాడు. కళ్ళు తెరిచేసరికి ఎదురుగా, పురుడుపోసిన అందమైన నర్సు కురచ దుస్తుల్లో కనబడింది. పరాంకుశం పెదవులపై చిరునవ్వు చిందిస్తూ కన్ను గీటాడు. ప్రకృతి విరుద్ధంగా కాలచక్రాన్ని వెనక్కి తిప్పకుండా, కాలగమనంలో ముందుకే పంపబడిన పరాంకుశానికి విలువలు మరింతగా మారిన నూతన ప్రపంచం స్వాగతం పలుకుతోంది.

ఆశ చావందే ఆత్మకి జన్మలు తప్పవు. ఆశకి మరణం సంభవించినప్పుడే ఆత్మకి మోక్షం లభిస్తుంది.

'మోక్ష సాధానికి ఆఖరి మెట్టువరకూ ఎక్కిన పరాంకుశం చిత్తచాంచల్యంతో తిరిగి జన్మబంధంలో చిక్కుకొన్నాడు! అమాయకుడు!'అనుకొన్నాడు సాధువు విచారంగా, నెమ్మదిగా చిలుము పీలుస్తూ.

★